ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో..రూపాయల్లో.. టమాటా.33, నల్లవంకాయ 21, పొడుగు వంకాయ 21, బెండకాయ 40, పచ్చిమిర్చి 53, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 65, పచ్చికాకర 23, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 13, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 23, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు దూర్వా గణపతి పూజ

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని వినాయక ఆలయంలో సోమవారం స్వామివారికి అత్యంత ప్రీతికరమైన దూర్వా (గరిక) గణపతి పూజ నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు దూర్వాలతో సహస్రనామ పూజ, అలంకారం, హారతి, ప్రసాద వినియోగం జరుగుతాయని పేర్కొన్నారు.

బాలు నిర్మలకు ఓయూ పీహెచ్‌డీ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ తెలుగుశాఖ పరిశోధక విద్యార్థిని డా.బాలు నిర్మలకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.మాది రెడ్డి అండమ్మ పర్యవేక్షణలో 'బోయ జంగయ్య కథలో మానవతా దృక్పథం' అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సత్కారం



ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు..

సనత్‌నగర్: ఒకవైపు కుండపోత వర్షం..అసలే ట్రాఫిక్.. సడెన్‌గా ఓ కుటుంబం వెళ్తున్న కారు టైర్ పంక్చర్ అయ్యింది. జోరు వానలో రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఆ కుటుంబానికి మహంకాళి ట్రాఫిక్ పోలీసులు సహాయం చేశారు. వర్షాన్ని పట్టించుకోకుండా స్వయంగా టైరు మార్చి ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పరిస్థితిని చక్కదిద్దారు. కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా మానవత్వంతో ముందుకువచ్చి అటు కుటుంబానికి సహాయాన్ని అందించడమే కాకుండా ఇటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసిన ఏఆర్‌పీసీలు జకీరుద్దీన్, నవీన్‌లను నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అభినందించారు. ఈ సందర్భంగా మహంకాళి పోలీసు సిబ్బంది సమక్షంలో వారిని సత్కరించారు.

బేగంపేటలో ఘనంగా బోనాల వేడుకలు



బోనాల వేడుకల్లో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత గిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ నేతలు శ్రీహరి, ఆరీఫ్ తెలిపారు.

'జగదీశ్వర్ మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి'

బంజారాహిల్స్: తెలంగాణ స్టేట్ హౌసింగ్ బోర్డు ఉద్యోగి జగదీశ్వర్ మృతి చెందడం బాధకరమని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2 రోజుల క్రితం హౌసింగ్‌బోర్డుకు చెందిన ఓ ఆస్తిని ఖాళీ చేయించాలంటూ ఆదేశాలు జారీ కావడంతో జగదీశ్వర్ అక్కడికి వెళ్లారన్నారు. ఆ ఒత్తిడితో ఆయన గుండెపోటుతో మరణించారని ఆరోపించారు. అధికారుల నుంచి వచ్చిన ఒత్తిళ్లు, ఆ ప్రదేశంలో వ్యక్తుల హింసాత్మక ప్రవర్తన, బౌన్సర్ల ప్రమేయంపై దర్యాప్తు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తమ యూనియన్ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుందని, న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు. త్వరలోనే సంబంధిత మంత్రి, జిల్లా కలెక్టర్, నగర సీపీని కలిసి జగదీశ్వర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తామని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి సంఘం పోరాడుతుందని వివరించారు.

సీతాఫల్‌మండి.. ఇలా ఎందుకండి?

అన్ని రైల్వేస్టేషన్లలో అలా... ఇక్కడ ఇలా..



సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్. మూసి వేసిన టికెట్ రిజర్వేషన్ కౌంటర్ (ఇన్‌సెట్)

- అభివృద్ధి గురించి పట్టించుకోని రైల్వే అధికారులు
- కరువవుతున్న సేవలు, వసతులు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని అన్ని రైల్వేస్టేషన్లు క్రమేణా అభివృద్ధి చెందుతుండగా సీతాఫల్‌మండి స్టేషన్ మాత్రం తిరోగమనం దిశగా అడుగులు వేస్తోంది. ఇక్కడి నుంచి ఇతర స్టేషన్ల కంటే ఎక్కువ సంఖ్యలో రైళ్లు, ప్రయాణికుల రాకపోకలు ఉంటున్నాయి. ఇటువంటి రైల్వేస్టేషన్లను మరింత ఆధునీకరించాల్సిన దక్షిణమధ్య రైల్వే అధికారులు సీతాఫల్‌మండి స్టేషన్ విషయంలో మాత్రం నిర్లక్ష్యవైఖరిని అవలంభిస్తున్నారు. విశాలమైన స్టేషన్, నాలుగు ప్లాట్‌ఫామ్‌లు, రెండువైపులా వందల సంఖ్యలో వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలం ఉన్నా అభివృద్ధిలో మాత్రం వెనుకబడుతోంది.

◆ సికింద్రాబాద్ జంకన్ చుట్టూ నెలకొని ఉన్న స్టేషన్లలో ఆధునీకరించడం, విస్తరించడం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్న అధికారులు ఇక్కడ చేపట్టకపోవడం పట్ల ఇక్కడి ప్రజల్లో నిరసన వ్యక్తం అవుతుంది.

పెరుగుతున్న ఆదరణ..

సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌కు దినదినం ప్రయాణికుల ఆదరణ పెరుగుతూ వస్తుంది. సికింద్రాబాద్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లో పలు రైల్వేస్టేషన్లు ఉన్నప్పటికీ రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల తాకిడి విషయంలో సీతాఫల్‌మండి స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఎక్కువ సంఖ్యలోని ఎంఎంటీఎస్ రైళ్ల రాకపోకలకు సీతాఫల్‌మండి కేంద్రంగా మారింది. నాలుగు ప్లాట్‌ఫామ్‌లతో కూడిన ఈ రైల్వేస్టేషన్ నుంచి 40 ఎంఎంటీఎస్ రైళ్లు, 20 వరకు సాధారణ, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం రెండు వేలకు పైచిలుకు ప్రయాణికులు వచ్చి వెళుతున్నారు.

◆ మూడేళ్ల క్రితం వరకు ఈ రైల్వేస్టేషన్ అభివృద్ధి విషయంలో రైల్వే అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ వచ్చారు. ఎంఎంటీఎస్ రైళ్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్, మనోహరాబాద్, నాందేడ్, మేడ్చల్, వాడి, పెద్దపల్లి తదితర మార్గాలకు కాచిగూడ నుంచి వెళ్లే అన్ని రైళ్లను ఇక్కడ నిలుపుతున్నారు. ఫలితంగా సీతాఫల్‌మండి, వారాసీగూడ, తార్నాక, హబ్సిగూడ, చిలకలగూడ, మెట్టుగూడ తదితర ప్రాంతాల ప్రజలు ఇక్కడి నుంచి వివిధ మార్గాలకు ప్రయాణాలు చేస్తున్నారు.

రిజర్వేషన్ కౌంటర్ మూసివేతతో

రైలు ప్రయాణాలతో పాటు సీతాఫల్‌మండి స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ మరింత ఉపయోగకరంగా ఉండేది. కరోనా లాక్‌డౌన్ ముందు వరకు ఈ రైల్వేస్టేషన్‌లో దేశవ్యాప్తంగా అన్ని రైళ్లకు టికెట్ రిజర్వేషన్ సేవలు అందుబాటులో ఉండేవి. లాక్‌డౌన్ సమయంలో నగరంలోని అన్ని ఎంఎంటీఎస్ స్టేషన్లతోపాటు ఇక్కడి రిజర్వేషన్ కౌంటర్‌ను కూడా మూసివేశారు. కొద్ది నెలల క్రితం మూతపడిన ఇతర స్టేషన్ల రిజర్వేషన్ కౌంటర్‌లను పునరుద్ధరించారు. నేటికీ సీతాఫల్‌మండి రిజర్వేషన్ కౌంటర్‌ను మాత్రం పునరుద్ధరించలేదు.

సనత్ నగర్‌లో కలకలం

ఎస్ఆర్‌టీ కాలనీలో ఇద్దరికి డెంగీ

- దాదాపు 100 ఇళ్ల నివాసితుల బ్లడ్ శాంపిల్స్ సేకరణ..
- అదనపు కమిషనర్ పర్యటన.. పరిస్థితులపై సమీక్ష..
- డెంగీ బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా..



సనత్‌నగర్‌లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సీఎస్ రఘుప్రసాద్

సనత్‌నగర్: సనత్‌నగర్‌లో డెంగీ కలవరపెడుతోంది. స్థానిక ఎస్సార్టీకాలనీలో ఇద్దరికి పాజిటివ్ రావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వైద్య, ఆరోగ్య శాఖ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా ఆ ప్రాంతంలో పర్యటించి శానిటేషన్ చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే డెంగీ పాజిటివ్‌గా తేలిన ఇంటి చుట్టుపక్కల దాదాపు 100 ఇళ్ల నివాసితుల నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపారు. ఎస్సార్టీకాలనీలో ఫెరెంత్రంను పిచికారి చేయించారు. అయితే డెంగీ కేసు నమోదు కావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన రేకెత్తుతోంది. ఎంటమాలజీ సిబ్బంది తూతూమంత్రంగా ఫాగింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్‌లో 800ల వరకు డెంగీ హాట్‌స్పాట్‌లను గుర్తించగా అందులో సనత్‌నగర్ కూడా ఉండడం స్థానికులకు కలవరపెడుతోంది. డెంగీ కేసులు నమోదైన తర్వాత అధికార యంత్రాంగం అప్రమత్తమై చర్యలకు ఉపక్రమించింది. అదే ముందస్తుగా చర్యలు తీసుకుంటే డెంగీ కేసులు నమోదయ్యేవి కావు కదా? అన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఈ మేరకు ప్రజలకు ఖైరతాబాద్ సర్కిల్ ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి పలు సూచనలు జారీ చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా దోమల వ్యాప్తికి ఆస్కారం ఇవ్వకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోవాలని, జీహెచ్‌ఎంసీ తీసుకుంటున్న జాగ్రత్త చర్యలతో పాటు ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. పాడుబడ్డ డ్రమ్ములు గానీ, ఇతరత్రా పాత్రలు, కుండలు గానీ ఉంచకుండా జాగ్రత్తపడాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది ఆ ప్రాంతానికి వచ్చినప్పుడు తమ నివాసాల ముందు, ప్రాంగణాల్లో దోమల నివారణ ఫైరెంత్రంను పిచికారి చేయించుకోవాలి. డోర్–టు–డోర్ సర్వే కోసం వచ్చే ఎంటమాలజీ సిబ్బందికి సహకరించి తమ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయించుకోవడంతో పాటు స్ప్రే కూడా చేయించుకోవాలి.

వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

గ్రేటర్ హైదరాబాద్‌లో డెంగీ వ్యాధి నివారణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ (హెల్త్) సీఎస్ రఘుప్రసాద్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ సనత్‌నగర్‌లో డెంగీ పాజిటివ్ కేసులు నమోదైన ఎస్సార్టీకాలనీలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. సనత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని ఎస్సార్టీ కాలనీలో డెంగీ బాధితులతో రఘుప్రసాద్ నేరుగా మాట్లాడి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. డెంగీ కేసులు నమోదైన కాలనీల్లో జ్వర పీడితులు, అనుమానితులకు డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలని వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులను ఎదుర్కోవడానికి, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ బృందాలు అవగాహన డ్రైవ్‌లు, యాంటీ–లార్వా ఆపరేషన్లు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు.

ఓయూ అభివృద్ధికి నిధులు కేటాయించండి



మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న తిరుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కోరినట్లు విద్యార్థి జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆదివారం పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభమైనందున విద్యార్థులకు సకాలంలో కులం, ఆదాయం, ఇతర సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరగకుండా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసిన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఓయూ విద్యార్థి జేఏసీ నేతలు రమేష్, రాజేందర్, శివాజీ, శ్రీను, చరణ్, అరుణ్, శ్యామ్, ప్రకాష్ పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

రసూల్‌పురా: శ్రావణమాసం బోనాల జాతరను పురస్కరించుకుని బాలంరాయిలోని శ్రీ దేవి దండుమారమ్మ, ఈద్గా అంబేద్కర్‌నగర్ లోని సీతల పోచమ్మ ఆలయంలో ఆదివారం ఉదయం నుంచే భక్తులు క్యూలో నిల్చొని అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. దండుమారమ్మ ఆలయంలో ఈఓ రవికాంత్ ఆధ్వర్యంలో మొదటి బోనాన్ని సమర్పించారు. బోర్డు మాజీ సభ్యురాలు అనితా ప్రభాకర్ కుటుంబసభ్యులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటేల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదా కేశవరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు టీఎన్. శ్రీనివాస్, ముప్పిడి గోపాల తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు భానుక మల్లిఖార్జున్, బిఎన్. శ్రీనివాస్, వినోద, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేష్

ఘనంగా బోనాలు



అడ్డగుట్ట: అడ్డగుట్టలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు బస్తీలలోని అలయాలలో తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడ్డగుట్ట ,తుకారంగేట్ తదితర ప్రాంతాలలో భక్తులు బోనాలు ఎత్తుకొని వెళ్లి స్థానిక అలయాల్లో అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన గంధర్వ సదస్సు



బీడీఎస్ చైర్మన్‌తో కళాకారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ బీఈడీ కాలేజీలో నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన గంధర్వ–3 సదస్సు ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా బీడీఎస్ చైర్మన్, ఎండీ ఆత్మకూరి మాధవరావు పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా 50 మంది పరిశోధన విద్యార్థులు పాల్గొని పరిశోధన వ్యాసాలను సమర్పించారు. కార్యక్రమంలో సంగీత విద్వాంసులు ఆనంద మోహన్, శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల ప్రిన్సిపల్ పాండురంగ ముతాలిక్ పాల్గొన్నారు.

మేడిబావిలో ఘనంగా బోనాల వేడుకలు



మేడిబావి అమ్మవారి దేవాలయానికి బోనాలతో వస్తున్న మహిళలు



ముత్యాలమ్మ దేవాలయ బోనాల వేడుకలకు హాజరైన కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ

సికింద్రాబాద్: సీతాఫల్ మండి డివిజన్ మేడిబావిలోని శ్రీముత్యాలమ్మ, నల్లపోచమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాష్ కుటుంబం అమ్మవారికి మొదటిబోనం సమర్పించడంతో బోనాల వేడుకలు ప్రారంభమయ్యాయి. సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, వివిధ పార్టీల నేతలు మేకల సారంగపాణి, నోముల ప్రకాశ్ రావు, ఆదం సంతోష్, కంది నారాయణ, వల్లారపు శ్రీనివాస్, రవి ప్రసాద్ గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్, ఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: పేద, మధ్య తరగతి ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. డివిజన్‌లోని న్యూరెడ్ రోజు ఫంక్షన్ హాలులో ఆదివారం షనాయ్ హస్పిటల్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హజరైన స్థానిక ప్రజలకు బీపీ, షుగర్ ఇతర అరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

'బీసీ జాబితాలో ఆ కులాలను మళ్లీ చేర్చాలి'



మాట్లాడుతున్న అధ్యక్షుడు మీరా కుమార్

పంజగుట్ట: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలలోపే బీసీ జాబితా నుంచి తొలగించిన 27 కులాలను మళ్లీ చేర్చుతామని ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెలబెట్టుకోవాలని తెలంగాణ 27 క్యాస్ట్ బీసీ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీ మీరాకుమార్, సలహాదారులు కేఎస్.మూర్తి, వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి కృష్ణం నాయుడు మాట్లాడుతూ.. 2014లో రాజ్యాంగ విరుద్ధంగా జీఓ 3 తీసుకువచ్చి 27 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారన్నారు. అప్పటి నుంచి తమ పిల్లలు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లోనూ అవకాశాలు కోల్పోయి ఎంతో దీనస్థితిలో ఉన్నామని ఆవేదనవ్యక్తం చేశారు. సీఎం హామీ మేరకు వెంటనే తమను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు కేవీ రావు, సినీనటి రమ్యశ్రీ, రమాదేవి, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ సభ్యులకు ప్రివిలేజ్ కార్డులు

హిమాయత్‌నగర్: అగర్వాల్ సమాజ్ సభ్యులందరికీ ప్రివిలేజ్ కార్డులు అందిస్తామని తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. ఆదివారం నిర్వహించిన అగర్వాల్ సమాజ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అగర్వాల్ సమాజపు ఎన్నికల్లో కేంద్ర కమిటీకి పదవీ విరమణ చేసిన అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడితో పాటు, శాఖల పదవీ విరమణ చేసిన అధ్యక్షులకు కూడా ఓటు హక్కు కల్పించే ప్రతిపాదనను ఆమోదించినట్లు చెప్పారు. డా.అంజనీ కుమార్ అగర్వాల్, డా.చంద్రకాంత్ డకోటియా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



పోస్టర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్‌ను అమలుచేసి తన చిత్తశుద్ధిని చాటుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీని అమలు చేయకుండా బీసీలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పారదర్శకత లేకుండా కులగణన చేపట్టి హడావుడిగా అసెంబ్లీలో బిల్లును చేసి రాష్ట్రపతికి ఆమోదం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పంపిందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులుయాదవ్, నాయకులు అశోక్‌యాదవ్, రమేష్, లింగస్వామి, అభిలాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో అన్నదానం



గాంధీఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న అయ్యప్పధర్మశాస్త్ర సేవ సమితి ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో చింతల్ మధుసూదనరెడ్డినగర్‌కు చెందిన అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. గత దశాబ్దకాలంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బాలానగర్‌కు చెందిన ఎస్‌వీ ఇంజనీర్స్ సంస్థ అధినేత బత్తుల కృష్ణమూర్తిస్వామి, రేఖ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని సుమారు 300 మందికి అన్నదానం చేశారు. అయ్యప్ప ధర్మశాస్త్ర సేవసమితి అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి), పూల్లారావు పాల్గొన్నారు.

గోల్డ్‌సిక్కా కార్యాలయంలో చోరీ

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్ వేదికగా మొట్టమొదటి గోల్డ్ ఏటీఎం సేవలను అందిస్తున్న గోల్డ్‌సిక్కా కార్యాలయంలో కీలక సమాచారం కలిగిన కంప్యూటర్‌తో పాటు హార్డ్‌డిస్క్, మదర్ బోర్డు, గ్రాఫిక్‌కార్డ్, ఇతర పరికరాలు చోరీ అయ్యాయి. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్ మెట్రోస్టేషన్ సమీపంలో గల అశోకా రఘుపతి ఛాంబర్స్‌లోని రెండో అంతస్తులో గోల్డ్ సిక్కా ఏటీఎంతో పాటు సంస్థ కార్యాలయం కూడా ఉంది. అయితే కార్యాలయంలోని కీలకమైన కంప్యూటర్ కనిపించకుండా పోయినట్లు సంస్థ డైరెక్టర్ అంబికబుర్మన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 23న కంప్యూటర్‌తో పాటు హార్డ్ డిస్క్, మదర్‌బోర్డు, గ్రాఫిక్‌కార్డ్, ర్యామ్, కుక్కర్, మాస్టర్ తదితర పరికరాలను చోరీ అయినట్లు భావిస్తున్నారు. దొంగలు చోరీ సమయంలో కార్యాలయంలోని సీసీ కెమెరాలను తొలగించారు. సీసీటీవీ రికార్డింగ్, సర్వర్‌ను యాక్సెస్ చేయగలిగిన ఓ ఉద్యోగి ఈ చోరీకి పాల్పడి ఉంటాడని శనివారం పోలీసులకు అందజేసిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బేగంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి రిమాండ్

బంజారాహిల్స్: యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్ బీ–బ్లాక్‌లో నివసించే రేణుక కొంతకాలం క్రితం చల్లా వినయ్‌కుమార్‌ను ప్రేమించింది. సదరు యువకుడు జులాయిగా తిరుగుతుండడంతో పాటు డ్రగ్స్‌కు బానిస కావడంతో యువతి కొంతకాలంగా దూరంగా ఉంటోంది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న యువకుడు ఈనెల 9న యువతి పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి తీవ్రంగా కొట్టి ఆమె ద్విచక్రవాహనంపైనే బలవంతంగా ఎక్కించుకుని మద్యం మత్తులో వస్తుండగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో వారు వాహనాన్ని సీజ్ చేశారు. ఇంటికి వెళ్లిన యువతిని ద్విచక్ర వాహనం ఏదని తల్లి ప్రశ్నించగా మెకానిక్‌కు ఇచ్చానని చెప్పింది. అయితే తల్లికి అబద్ధం చెప్పానన్న బాధను తట్టుకోలేక ఈనెల 10న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. దీంతో మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు వినయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధిత యువతి ద్విచక్రవాహనం కూడా తన బాబాయిది కావడంతో పాటు పోలీసులు సీజ్ చేయడం, డ్రంకన్ డ్రైవ్‌లో వినయ్‌కుమార్ దొరకడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.